క్లుప్తంగా

నేడు కోట్నివానిపాలెం రామాలయ వార్షికోత్సవం



కొలువుదీరిన కోదండరాముడు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో కొలువుదీరిన సంపత్ వినాయక పూర్వక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత సీతారాముల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా వేడుకలో పాల్గొని కోదండరాముడి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

ఘనంగా నూకాంబిక పండగ



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెంలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి పండగను స్థానిక నందవరపు కుటుంబం ఆదివారం ఘనంగా జరుపుకుంది. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు శ్రీనివాసరావు సోదరులు కుటుంబ సమేతంగా ఉదయం అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నందవరపు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదీప్‌రాజ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పారావు(కబడ్డి), పలువురు నాయకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకాహారం శ్రేయస్కరం



చిన అప్పలనాయుడును సత్కరిస్తున్న బ్రహ్మకుమారి

పెందుర్తి: మాంసాహారం కంటే శాకాహారమే ఆరోగ్యానికి మంచిదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు అన్నారు. పెందుర్తిలోని ఓంశాంతి బ్రహ్మకుమారీస్ మందిరంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఓంశాంతి ప్రతినిధులు ఆదర్శప్రాయులన్నారు. జంతుబలి నిషేధానికి వారు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు వారెప్పుడు సిద్ధంగా ఉంటారని చెప్పారు. ఓం శాంతి పెందుర్తి శాఖ ప్రతినిధి భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొ0న్నారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: లక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వెంకటాద్రిపై కొలువైన లక్ష్మీ అమ్మవారికి ఆదివారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు జరిపి విశేష అలంకరణ చేశారు. అనంతరం గోత్రనామార్చన జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

లోకాలనేలే స్వామి.. వారి భుజస్కంధాలపై..

వరాహ, నారసింహ అవతారాలను ఒక్కటిగా చేసుకుని సింహగిరిపై వెలసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో తిరువీధి ఉత్సవాలు ఎంతో ప్రత్యేకం. నిత్య, వార్షిక, ప్రత్యేక ఉత్సవాల సమయంలో ఆలయ బేడామండపంలో, సింహగిరి మాడ వీధుల్లో, కొండదిగువ అడవివరం గ్రామంలో స్వామి తిరువీధులు ఎంతో వైభవంగా జరుగుతాయి. డోలీలో స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, ఆ డోలీని తమ భుజస్కంధాలపై మోసే అదృష్టం విజినిగిరిపాలెం, అడవివరం వాసుల సొంతమైంది. 1100 మెట్లు ఉండే మార్గంలో స్వామి పల్లకీని కొండ పైకి ఎక్కి, దిగేటప్పుడు మోయడం కష్టమే అయినా ఆ భగవంతుడే తమ శ్రమను మరపింపజేసి ముందుకు నడిపిస్తాడనే ప్రగాఢ విశ్వాసంతో వారు అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యం.



అప్పన్న సేవలో తరిస్తున్న బోయీలు • స్వామి పల్లకీ మోసే అరుదైన అవకాశం • సుమారు పాతికేళ్లుగా 24 మంది సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగే తిరువీధుల్లో స్వామివారి పల్లకీ మోసే బోయీలుగా విజినిగిరిపాలెం, అడవివరం నివాసితులు 25 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారు. స్వామి సేవలో తరించే అవకాశం దక్కడం ఆ భగవంతుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నారు.

ఏటా నాలుగు సార్లు కొండ దిగువకు..

అప్పన్న స్వామి ఏటా నాలుగుసార్లు సింహగిరిపై నుంచి కొండదిగువకు వేంజేస్తారు. పెళ్లిచూపుల తంతుగా ఫాల్గుణ పౌర్ణమిరోజు నిర్వహించే డోలోత్సవం నాడు, పుష్య బహుళ అమావాస్యనాడు వరాహ పుష్కరిణిలో జరిగే తెప్పోత్సవం రోజు, విజయదశమిరోజు పూలతోటలో జరిగే జమ్మివేట ఉత్సవంనాడు, కనుమ రోజు పూలతోటలోనే జరిగే గజేంద్రమోక్షం ఉత్సవంనాడు స్వామివారు సింహగిరిపై నుంచి కొండదిగువకు వస్తారు. ఆయా రోజుల్లో సింహగిరిపై నుంచి దిగువకు మెట్లమార్గంలో డోలీలో స్వామివారి ఉత్సవమూర్తులను బోయీలు తీసుకొస్తారు. సుమారు పదకొండు వందల మెట్లు డోలీని మోసుకుంటూ దిగడం, ఎక్కడం అంటే కష్టతరమే. ముఖ్యంగా ఆంజనేయస్వామి సన్నిధి వద్ద ఉన్న మెట్లు ఎక్కడం, దిగడం మరింత కష్టం. ఎంతో బ్యాలెన్స్ చేసుకుని డోలీని మోయాలి. కానీ ఆ కష్టాన్ని సైతం లెక్కచేయకుండా విజినిగిరిపాలెం, అడవివరం వాసులు ఎంతో జాగ్రత్తగా డోలీని మోసుకుంటూ కొండదిగువకు తీసుకొస్తారు. అదేవిధంగా ఉత్సవాల అనంతరం తిరిగి కొండపైకి చేరుస్తుంటారు.

- ఫాల్గుణ పౌర్ణమిరోజు డోలోత్సవం ముగిసిన తర్వాత డోలీలోనే స్వామికి అడవివరం గ్రామంలో తిరువీధి జరుగుతుంది. ఆ డోలీని కూడా వారే మోస్తారు.
- జమ్మివేట, గజేంద్రమోక్షం, తెప్పోత్సవాలు ముగిసిన తర్వాత అడవివరం గ్రామంల జరిగే తిరువీధిలో స్వామి కొలువుదీరే ట్రాలీనీ వారే నడుపుతారు.

ఉత్సవవేళ ముందుగానే పిలుపు

విజినిగిరిపాలెంలో పన్నెండు మంది, అడవివరంలో పన్నెండు మంది ప్రస్తుతం స్వామివారి తిరువీధుల్లో పల్లకీ మోసే బోయీలుగా సేవలందిస్తున్నారు. ఉత్సవాల సమయంలో స్వామికి జరిగే తిరువీధుల సమాచారాన్ని, కొండదిగువకు స్వామిని తీసుకెళ్లే తేదీలను ముందుగా దేవస్థానం అధికారులు రెండు ప్రాంతాల్లో ఉండే బోయీలకు సమాచారం అందిస్తారు. దాన్ని బట్టి వారంతా ఆయా రోజుల్లో సింహగిరికి చేరుకుంటారు. నిత్య, సాధారణ ఉత్సవాల్లో జరిగే తిరువీధులకు రొటేషన్ పద్ధతిలో విజినిగిరిపాలెం నుంచి 12మంది, అడవివరం నుంచి 12మంది వచ్చి సేవలందిస్తుంటారు. ప్రముఖ, వార్షిక ఉత్సవాల్లో మొత్తం 24 మంది వరకు హాజరవుతుంటారు. వీరంతా సంప్రదాయ వస్త్రధారణల్లో తరలివచ్చి స్వామివారి డోలీ సేవలో నిమగ్నమవుతారు. వారి సేవలకు దేవస్థానం కొంత నగదు అందిస్తుంది. దాన్ని ఆ భగవంతుడు ఇచ్చిన ప్రసాదంగా వారు భావిస్తారు.



అప్పన్న పల్లకీ సేవలో తరిస్తూ..

వేంకటేశ్వరస్వామి తిరువీధి సేవలో..

కొండదిగువ సింహాచలం దేవస్థానానికి చెందిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలను భీష్మ ఏకాదశి రోజుల్లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తుంటారు. ఈ రోజుల్లో రెండు పర్యాయాలు అడవివరం గ్రామంలో వెంకన్నకు డోలీపైనే తిరువీధి నిర్వహిస్తారు. ఆ తిరువీధుల్లోనూ డోలీని వారే మోస్తారు.

- ఏటా కార్తీక పౌర్ణమిరోజు వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి జరుగుతుంటుంది. ఆ కార్యక్రమానికి వెంకన్న ఆలయం నుంచే ఉత్సవమూర్తులను వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్తారు. ఆ సేవలోనూ వారే బోయీలుగా తరిస్తున్నారు.

ఏ జన్మ పుణ్యమో..



నేను సుమారు 25ఏళ్ల నుంచి స్వామివారి తిరువీధుల్లో పల్లకీ మోస్తున్నాను. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో, స్వామివారి పల్లకీ మోసే అదృష్టం దక్కింది. ఇది భగవంతుడి ప్రసాదంగానే భావిస్తాను. భుజాలపై స్వామిని మోసుకెళ్తుంటే ఎక్కడ లేని ఆనందం కలుగుతుంది. నాలో శక్తి ఉన్నంత వరకూ స్వామివారి తిరువీధుల్లో పల్లకీ మోస్తాను.

– సువ్వాడ త్రినాథ్, విజినిగిరిపాలెం

స్వామి అనుగ్రహమే..



స్వామి పల్లకీ మోసే భాగ్యం రావడం భగవంతుడి అనుగ్రహంగా భావిస్తాను. నేను ఇరవై రెండేళ్ల నుంచి తిరువీధిలో పల్లకీ మోస్తున్నాను. మిగతా రోజుల్లో వ్యవసాయం, ఇతర పనులకు వెళ్తుంటాను. ఎప్పుడు స్వామివారి తిరువీధి జరుగుతుందా అని ఎదురుచూస్తుంటాను.

–పల్లినారాయణరావు, విజినిగిరిపాలెం

ఆ ప్రోత్సాహకం దేవుడిచ్చిన ప్రసాదం



తిరువీధుల్లో స్వామి పల్లకీ మోసే భాగ్యం కొందరికే దక్కుతుంది. అది మాకు దక్కడం వరంగా భావిస్తున్నాం. బోయీలకు దేవస్థానం అందించే ప్రోత్సాహం మరువలేం. సింహగిరిపై జరిగే తిరువీధి ఒక్కింటికి బోయీలకు మూడు వందల రూపాయల చొప్పున, మెట్లమార్గంలో కొండదిగువకు తీసుకెళ్లి అడవివరం గ్రామంలో జరిగే తిరువీధికి ఒక్కొక్కరికీ నాలుగు వందల రూపాయల చొప్పున దేవస్థానం నగదు అందిస్తుంది. ఆ నగదును దేవుడిచ్చిన ప్రసాదంగా భావిస్తాం.

– పొంద్రంకి నూకరాజు, అడవివరం

ఆ భగవంతుడే ముందుకు నడిపిస్తాడు



తిరువీధుల్లో పల్లకీ మోయడం అంటే ఎంతో గొప్పగా భావిస్తాం. పల్లకీ సేవలో పాల్గొంటే దైవ చింతనతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆరోగ్యం కూడా చేకూరుతుంది. సింహగిరిపై జరిగే తిరువీధుల్లో పెద్దగా శ్రమపడాల్సి రాకపోయినా, మెట్లమార్గంలో స్వామిని కొండదిగువకు చేర్చే క్రమంలో ఎంతో శ్రమించాలి. కానీ ఆ భగవంతుడే మమ్మల్ని ముందుకు నడిపిస్తుంటాడు.

– మజ్జి త్రినాథ్, విజినిగిరిపాలెం



విజినిగిరిపాలెం, అడవివరానికి చెందిన బోయీలు



స్వామివారి పల్లకీ మోస్తున్న బోయీలు

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

వైభవంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



స్వర్ణ పుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

గుర్తుకొస్తున్నాయి...



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గోపాలపట్నం: నరవ జిల్లా పరిషత్ పాఠశాల 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులంతా పిల్లల్లా మారి సందడి చేశారు. ఒకరికొకరు జ్ఞాపకాలను పంచుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలిసిన వారు విద్యార్థి దశను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అందరూ ప్రయోజకులై ఒక వేదికపై కనిపించడంతో ఉపాధ్యాయులు సంతోషంతో కన్నీటి పర్యంత మయ్యారు. కార్యక్రమాన్ని జె. శ్రీను, జీవీ నర్సింగరావు, మజ్జి నర్సింగరావు, జి. శ్రీను, అప్పలస్వామి, మళ్ల నూకప్పారావు, నాగేశ్వరరావు, అప్పలరాజు సమీక్షించారు.

వైభవంగా భూలోకమాంబ పండగ

- అమ్మవారికి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో పూజలు, సారె సమర్పణ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ పండుగ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అప్పన్నపాలెం, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ, సింహపురి కాలనీ, సింహపురి లేఅవుట్, వేపగుంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3.30 గంటలకు అమ్మవారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. తదుపరి విశేషంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం 4.30 గంటల నుంచి షోడశోపచార పూజలు, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పలు రకాల పిండివంటలతో అమ్మవారికి సారె సమర్పణ, మహా భోగ నివేదన చేశారు. పండగను పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పలు వేదికలపై పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, స్థానికులు పల్లా వెంకటేష్, జోగ మురళీ, సింగంపల్లి శ్రీనివాస్, సారిపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుర్రకథ, మహిళల కోలాటం అలరించాయి.

అమ్మవారిని దర్శించుకున్న అదీప్‌రాజ్

భూలోకమాంబ అమ్మవారిని ఆదివారం రాత్రి పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకుని, పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట 98వ వార్డు వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు పీతల విష్ణుమూర్తి, సూరిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న బర్ల నారాయణరావు తదితరులు

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన బర్ల నారాయణరావు రూ.30,116 విరాళంగా అందజేశారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆయన చేతుల మీదగా ఆదివారం అందించారు. ఈ సందర్భంగా నారాయణరావు కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దెడ్డం కృష్ణ, దంగేటి నాగేశ్వరరావు, దంగేటి ప్రసాద్, బర్ల రమణ, కోరాడ శ్రీను, చింతల శ్రీను, కోళ్లి కృష్ణ, ముర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుతూ.. పాడుతూ...



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హ్యాపీ అవర్స్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కుటుంబ సభ్యులు, జీఎంఎస్‌కేలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని ఆటలాడుతూ.. పాటలు పాడుతూ సందడి చేశారు. నృత్యాల ప్రదర్శనలతో ఆనందంగా గడిపారు. ఆటపాటల్లో విజేతలకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు బహుమతులు అందజేశారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న వారంతా అల్పాహారం స్వీకరించారు. కార్యక్రమంలో మహిళా ఎస్ఐ మహాలక్ష్మి, ఎస్ఐ.కృష్ణారావు, రైటర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్ తదితరులు

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో కొలువైన శ్రీముత్యాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు, నాయకులు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్ చేతుల మీదుగా టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విజేత జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో సోమలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజ కోటి, వీరప్పారావు, సోమేశ్వరరావు, దాడి శివ, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

సింహపురి కాలనీలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న చిరంజీవిరావు, విష్ణుమూర్తి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలోని సీతారామాలయం, ఉపాలయాల వార్షికోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిరంజీవిరావు, సింహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సెక్రటరీ అప్పల నాయుడు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, మాజీ సెక్రటరీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం



ఐక్యత చాటుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మల్కాపురం: గడిచిన యూనియన్ ఎన్నికల్లో షిప్‌యార్డ్ కార్మికులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, అది నెరవేర్చే వరకు అలుపెరగకుండా శ్రమిస్తామని షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామమూర్తి అన్నారు. 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద షిప్‌యార్డ్ ఐఎన్‌టీయుసీ (గుర్తింపు యూనియన్), ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంస్థలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావ తదితర నాయకులు పాల్గొన్నారు.

నూతన పాలక వర్గం

ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఐఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడిగా పైలా శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా ఎస్.రవికుమార్, సెక్రటరీగా టి.నూకరాజు, కోశాధికారిగా ఎం.చంద్రమోహన్ నియమితులయ్యారు. ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పైలా శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా బి.మారుతీరావు, ప్రచార కమిటీ చైర్మన్‌గా భోగవల్లి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



వేడుకలో పాల్గొన్న పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం సందడిగా నిర్వహించారు. నృత్యాలు, దేశ భక్తి గీతాలు, స్కిట్స్, కరాటే విన్యాసాలతో విద్యార్థులు అలరించారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం చేసి, పట్టాలు అందించారు. పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్, ప్రిన్సిపాల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ మల్లికారెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.